# వందశాతం ఓటింగ్ నమోదు కావాలి

- ఉదయం పూట పోలింగ్ అధికంగా జరిగేలా చూడాలి
- వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు
- కథలాపూర్‌లో ఎన్నికల నియమావళిపై కార్యకర్తలకు అవగాహన



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

కథలాపూర్, నవంబర్ 29: వేములవాడ నియోజకవర్గంలో వందశాతం పోలింగ్ నమోదయ్యేలా చూడాలని వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు కార్యకర్తలకు సూచించారు. గ్రామాల్లో ఓటర్లను ఉదయమే పోలింగ్ కేంద్రాలకు తరలించి ఎక్కువ ఓట్లు పోలయ్యేలా చూడాలన్నారు. బుధవారం కథలాపూర్ మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలకు ఎన్నికల నియామవళి, నియమ నిబంధనలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి కార్యకర్త ప్రతి ఓటరును కలిసి పోలింగ్ కేంద్రాలకు తరలించాలన్నారు. ఎక్కువ శాతం ఓట్లు ఉదయమే పూర్తి చేయాలని అందుకు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రతి కార్యకర్త తానే అభ్యర్థిగా భావించుకుని కష్టపడి పనిచేయాలన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తు మార్చేవని, కేవలం ఎమ్మెల్యేల కోసమే కాదని ప్రజలు గమనించి ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఇక్కడ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు గడ్డం భూమారెడ్డి, మామిడిపెల్లి రవి, గుండారపు గంగాధర్, వర్దినేని నాగేశ్వర్‌రావు, కల్లెడ శంకర్, మైస శ్రీధర్, కిరణ్ పాల్గొన్నారు.

## అతివలే నిర్ణేతలు

- హుజూరాబాద్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే కీలకం
- పురుషుల కన్నా 5,157 ఓట్లు అధికం

హుజూరాబాద్, నవంబర్ 29: నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే కీలకంగా మారనున్నారు. అభ్యర్థుల గెలుపోటములను అతివలే నిర్ణయించనున్నారు. ఎన్నికల అధికారులు రూపొందించిన నూతన ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలు ఉండగా, ప్రతి మండలంలోనూ వారిదే పైచేయిగా ఉంది. ఇందులో అత్యధికంగా హుజూరాబాద్ మండలంలో, అత్యల్పంగా ఇల్లందకుంట మండలంలో మహిళలు ఓటర్లుగా ఉన్నారు. నియోజకవర్గంలో 305 పోలింగ్ బూత్‌లు ఉండగా, మొత్తం 2,44,514 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,19,676, మహిళా ఓటర్లు 1,24,833 ఉన్నారు. దీన్ని బట్టి చూస్తే 5,157మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, ఎన్నికల్లో వారి ప్రభావం ఎక్కువగా కనిపించనున్నది.

*మండలాల వారీగా ఓటర్లు..*

హుజూరాబాద్ మండలంలో మొత్తం ఓటర్లు 63,145 ఉండగా, ఇందులో పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లు 1,787 మంది అధికంగా ఉన్నారు. ఇక్కడ 79 పోలింగ్ బూత్‌లు ఉండగా, పురుష ఓటర్లు 30,679, మహిళా ఓటర్లు 32,466 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కమలాపూర్ మండలంలో మొత్తం ఓటర్లు 52,655 ఉండగా, పురుషులతో పోలిస్తే 1,193మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక్కడ 65 పోలింగ్ బూత్‌లు ఉండగా, పురుష ఓటర్లు 25,731, మహిళా ఓటర్లు 26,924 మంది ఓటేయనున్నారు. జమ్మికుంట మండలంలో మొత్తం ఓటర్లు 61,064 ఉండగా, పురుషులతో పోలిస్తే 1,070మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక్కడ 77 పోలింగ్ బూత్‌లు ఉండగా, పురుష ఓటర్లు 29,997, మహిళా ఓటర్లు 31,067 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.వీణవంక మండలంలో మొత్తం ఓటర్లు 41,672ఉండగా, పురుషులతో పోలిస్తే 735మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక్కడ 55 పోలింగ్ బూత్‌లు ఉండగా, పురుష ఓటర్లు 20468, మహిళా ఓటర్లు 21203 మంది ఓటేయనున్నారు. ఇల్లందకుంట మండలంలో మొత్తం ఓటర్లు 25,975 ఉండగా, పురుషులతో పోలిస్తే కేవలం 372 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక్కడ 29 పోలింగ్ బూత్‌లు ఉండగా, పురుష ఓటర్లు 12,801, మహిళా ఓటర్లు 13,173 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇతరులు హుజూరాబాద్ మండలంలో ముగ్గురు, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లో ఒకరు చొప్పున ఉన్నారు. కాగా, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వారిని ప్రసన్నం చేసుకోవడానికి పావులు కదుపుతున్నారు. ఓటరు జాబితా లెక్కల ప్రకారం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల భవితవ్యం మహిళలపైనే ఎక్కువగా ఆధారపడి ఉండనడంలో సందేహం లేదు.

## ఎన్నికల వేళ జర పైలం

- బైండోవర్ అయ్యారా..? జాగ్రత్త
- ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ శాఖ చర్యలు
- ఇప్పటికే తహసీల్దార్ ఎదుట వందల మంది హాజరు
- నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

తిమ్మాపూర్, నవంబర్ 29: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడడం ఎన్నికల కమిషన్ విధి. ఎవరైనా ఈ ప్రక్రియకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే కేసులు కూడా నమోదు చేస్తుంది. గొడవలకు కారణమయ్యే నేరస్వభావం ఉన్న వారిని బైండోవర్ చేయిస్తుండగా, దీనిని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటుంది.

తిమ్మాపూర్ మండలం గొడవలు, కక్షలకు తావు లేకుండా ఉన్నప్పటికీ ఎల్ఎండీ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు వేర్వేరుగా అన్ని పార్టీలకు చెందిన పలువురు లీడర్లు, నేర స్వభావం ఉన్నవారు, రౌడీషీటర్లు, బెల్ట్‌షాప్ నిర్వాహకులను ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అయిన తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 107కింద బైండోవర్ చేశారు. ఇప్పటి వరకు తిమ్మాపూర్ మండలంలో పోలీస్ శాఖ తరపున 327, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 130మందిని బైండోవర్ చేశారు.

**ముందస్తు అస్త్రం:** ఎవరైనా వ్యక్తులతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ఈ బైండోవర్ అస్త్రాన్ని ఉపయోగిస్తారు. బైండోవర్ కేసు నమోదైన వారు ఆరు నెలల్లోపు ఏదైనా కేసులో ఇరుక్కున్నా, వారిపై కేసు నమోదైనా ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారికి ఆరు నెలల జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా విధిస్తారు. కొన్నిసార్లు తహసీల్దార్ విచక్షణాధికారం ఉండే అవకాశం కూడా ఉంది. తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన పొనగంటి అజయ్ ఒక నేరంలో నిందితుడిగా ఉన్నాడు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇటీవల అతడిని ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి.. తహసీల్దార్ కనకయ్య ఎదుట బైండోవర్ చేశారు. ఈ క్రమంలో అజయ్ అక్టోబర్31న మరో నేరం చేయగా, ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి అరెస్ట్ చేసి, బైండోవర్ కేసు ఉన్నందున ఆయన నేర చరిత్రను వివరిస్తూ తహసీల్దార్ కనకయ్య ముందు ప్రవేశపెట్టారు. దీంతో అతడి నేర చరిత్రను పరిశీలించిన తహసీల్దార్, ఆరు నెలల జైలుశిక్ష లేదా, రూ.లక్ష జరిమాన చెల్లించాలని ఉత్తర్వులు అందజేశారు. దీంతో పొనగంటి అజయ్ రూ.లక్ష జరిమానాను బుధవారం చెల్లించాడు.

*ప్రశాంత వాతావరణం కోసమే:*

*శీలం ప్రమోద్‌రెడ్డి, ఎస్ఐ, ఎల్ఎండీ*

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు నేర చరిత్ర ఉన్నవారిని బైండోవర్ చేశాం. బైండోవర్ అయిన వాళ్లు ఏదైనా నేరం చేస్తే శిక్ష లేదా జరిమానా తప్పదు. శాంతిభద్రతలకు భంగం కలిగించిన ఎవరిపైనైనా కేసులు నమోదు చేస్తం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలి.

## ఉద్యమాన్ని మలుపు తిప్పిన దీక్షా దివస్

**ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు సతీశ్‌కుమార్**

కోరుట్ల, నవంబర్ 29: సీఎం కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్ చరిత్రను మలుపు తిప్పిన రోజు అని ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన దీక్షాదివస్ 14 ఏళ్లు గడిచిన నేపథ్యంలో బుధవారం ఆయన మాట్లాడుతూ, ఉద్యమ నాయకుడు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ పోరుకు రణ నినాదమైందన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం చావు నోట్లో తలపెట్టిన కేసీఆర్ చావోరేవో నినాదంతో ప్రజల చిరకాల స్వప్నాన్ని నిజం చేశారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలతో దేశంలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ త్యాగనిరతికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఇబ్రహీంపట్నం, నవంబర్ 29: వేములకుర్తి గ్రామానికి చెందిన కేడీసీసీబీ జిల్లా మాజీ డైరెక్టర్ ఆరె రాజ్‌కుమార్(48) బుధవారం ఉదయం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం, గ్రామశివారులో ఉన్న తన లత పౌల్ట్రీ ఫాం వద్దకు ఉదయం వెళ్లాడు. పౌల్ట్రీ ఫాంకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ బంద్ చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పౌల్ట్రీ ఫాంలో పని చేస్తున్న కార్మికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. అక్కడికి కుటుంబ సభ్యులు వెళ్లి చూసే సరికి మృతిచెందాడు. కాగా పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడున్నారు. ఆయన మృతిపై గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఫేస్‌బుక్ మిత్రుల ఔదార్యం

**రూ.1.32 లక్షల ఆర్థిక సాయం**



సురేశ్ భార్య రాణికి నగదును అందజేస్తున్న రమేశ్

ధర్మపురి, నవంబర్ 29: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఫేస్‌బుక్ మిత్రులు ఔదార్యం చూపి రూ.1.32 లక్షల ఆర్థిక సాయం అందించారు. వివరాలిలా ఉన్నాయి. ధర్మపురి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దివిటి సురేశ్ కొన్నినెలల క్రితం ఉపాధి కోసం దుబాయికి వెళ్లాడు. అక్కడ సరైన పని దొరకకపోవడంతో ఆరు మాసాల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. అయితే దురదృష్టవశాత్తు నాలుగు నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో కాలు, చేతు పడిపోయి మంచానికే పరిమితమయ్యాడు. వైద్యం కోసం ఇప్పటి వరకు రూ.4లక్షల వరకు అప్పు చేసి ఖర్చు చేయగా పూర్తిగా నయం కాలేదు. డబ్బులు లేక చికిత్స చేయించుకోలేక ఇబ్బందులు పడుతుండగా.. విషయం తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్, సురేశ్ ఆర్థిక, అనారోగ్య పరిస్థితిని వివరిస్తూ, మిత్రులు ఆదుకోవాల్సిందిగా కోరుతూ సురేశ్ భార్య రాణి బ్యాంకు ఖాతా వివరాలతో ఈ నెల 4న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. ఈ పోస్టుకు స్పందించిన ఎన్నారైలు రాణి బ్యాంకు ఖాతాలో రూ.1.32 లక్షలు జమ చేయగా బుధవారం ఆ నగదు డ్రా చేసి సురేశ్ భార్య రాణికి అందజేశారు. ఈ సందర్భంగా ఫేస్‌బుక్ మిత్రులకు సురేశ్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## బాధిత కుటుంబానికి ప్రముఖుల పరామర్శ

మానకొండూర్ రూరల్, నవంబర్ 29: మండలంలోని ముంజంపల్లి గ్రామ సర్పంచ్ రామంచ గోపాల్ రెడ్డి మామ ఉమ్మెంతల నర్సింహారెడ్డి (94) బుధవారం మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## తెలంగాణ అమరవీరులకు ఘన నివాళి

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 29: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్‌ను పురస్కరించుకుని తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పూలు చల్లి, అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. జై తెలంగాణ, జై జై తెలంగాణ, కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830. NT-314461

CHANGE OF NAME

★I, SAYADA NAZIA BADAR, W/o. Mohammed Abdul Salam, R/o. 6-6-363, Saheth Nagar, Karimnagar, TS. Changed My Name as SAYYADA NAZIA BADAR, W/o. Mohammed Abdul Salam. NT-313031

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194